# సత్యవతి

సత్యవతి యమునా నదీ తీరానికి బయలుదేరుతుంటే దాశరాజు ఆమె వివాహ విషయం ఆలోచించసాగాడు. సంపూర్ణ యౌవనంతో తొణికిసలాడుతోంది సత్యవతి. ఆమె రూపయౌవనాలు ఎందర్నో ఆకర్షించినా, ఆమె ఎవరినీ వివాహం చేసుకుందుకు ఇష్టపడటంలేదు. ఆమెకు వివాహ శుభఘడియలు ఎప్పుడొస్తాయో, ఏమో అనుకున్నాడు దాశరాజు.

సత్యవతికి ఆ రోజు ఎంతో ఉత్సాహంగా ఉంది. రోజూ తను చేరే ఆ నావ ఈనాడెందుకో కొత్తగా కనిపించింది. యమునా నదీజలాలు, దగ్గరలో ఇసుక తిన్నెలు ఆమెకు రోజూకన్నా అందంగా కనిపించాయి. నదీజలాల గలగలలు సంగీత స్వరాల్లా ఆమె చెవులకి సోకాయి. పరాశరముని వరప్రభావం వల్ల తనున్న ప్రాంతమంతా సుగంధ పరిమళభరితమవటం అనుభవంతో ఉన్నదే. తనను ప్రేమించి వివాహం చేసుకుందుకు వచ్చేవారెవరైనా తనకు ఇష్టం కలగటంలేదు. తను ఇలాగే ఉండిపోతుందా ఇక? మెడలో ఉన్న హారాల్ని సరి చేసుకుంటూ, చెంగు చెంగున గంతులేస్తూ వచ్చి వయ్యారంగా నావని అనుకుని నిలబడింది సత్యవతి.

యమునా నదీ తీరాన వేటకని వచ్చి ఆ ప్రాంతమంతా సంచరిస్తున్న శంతన మహారాజు ఆ ప్రాంతంలోని అపూర్వమైన సుగంధాన్ని ఆఘ్రాణిస్తూ, అదే దిక్కుకి నడక సాగించాడు ఆశ్చర్యంతో. అతని ఆశ్చర్యం కొన్ని రెట్లు పెరిగిపోయింది ఎదురుగా ఉన్న స్త్రీమూర్తిని చూడగానే.

సత్యవతిని అలా చూస్తూ యమునా నదీ తీరాన నిలబడ్డాడు శంతనుడు. ఆమె విశాల నయనాలు, పురివిప్పిన నెమలి పింఛంలా వ్యాపించిన ఆమె కేశపాశం, అమె మనోహరాకృతి, శరీర సౌరభం అతన్ని ఒక్కసారిగా మదన పరవశుణ్ణి చేశాయి. దేవకాంతలా కనిపించిందామె. ఆ సౌందర్యం ఇంతకు ముందెన్నడూ చూడనట్టే ఉంది. ఆమె విలాసం అతన్ని అనురాగబద్ధుణ్ణి చేస్తుంటే ఆమెవైపునుంచి చూపు మరల్చుకోలేకపోయాడు శంతనుడు.

ఇంత కాలంగా ఓడ నడుపుతున్నా ఏనాడూ ఇలాటి రాజఠీవితో ఒప్పిన సౌందర్యవంతుడైన పురుషుణ్ణి చూడలేదు తను - అనిపించింది సత్యవతికి అతన్ని చూస్తుంటే. ఆజానుబాహుడైన ఆ మహారాజు రూపం ఆమెను ఎంతగానో ఆకర్షించింది. తనను ప్రేమించిన వారందరినీ తను తిరస్కరించింది కానీ, ఈ మహారాజుపైన తన మనసు లగ్నమవటం చిత్రంగా అనిపించిన సత్యవతి, అతని వంక వాలుచూపులు చూస్తూ, తల వంచి నిలిచింది.

"నువ్వెవరు, ఈ నదీతీరంలో ఒంటరిగా, ఇలా నావ నడుపుతూ?..." శంతనుడు ఆ ముగ్ధమనోహరమూర్తిని చూపులతో ఆరాధిస్తున్నాడు.

చిరునవ్వు నవ్వి వంచిన తల ఎత్తింది.

"దాశరాజ కూతుర్ని. మా తండ్రి మాట ప్రకారం ఈ నావ నడుపుతున్నా".

ఆమె గొంతులో కోయిలలు పలికినట్లైంది మహారాజుకి. దాశరాజు గురించి ఇంతకుముందు విన్నాడు.

గంగ తనను వదిలి వెళ్ళిన తరువాత స్త్రీ వైపు ఏనాడూ మనసు మరల లేదు. మరొక స్త్రీని తను కన్నెత్తి చూడలేదు. ఈనాడు ఈమెను చూసిన దగ్గర నుంచీ తన మనసు ఆమె చుట్టూ పరిభ్రమిస్తోం దెందుకో?

ఇంతకాలానికి ఆమెపైన తన మనసు మరలటం ఆనందంగానూ ఆశ్చర్యం గానూ ఉంది శంతనునికి. ఈమెను వివాహం చేసుకుంటే తన జీవితంలో తిరిగి వసంతం ప్రవేశించదా? సత్యవతీ దేవి ప్రణయ సామ్రాజ్యపు ఊహల్లో తేలి పోయాడు శంతను డపుడే.

కన్యార్థి అయి శంతన మహారాజు స్వయంగా రావడంతో ఆనందంతో, గర్వంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు దాశరాజు. అత్యంత భక్తిశ్రద్ధలతో మహా రాజుకు అతిథిపూజ లొనర్చాడు.

సత్యవతి వివాహానికి వెంటనే తను అంగీకారం తెలిపితే ఎలా?

దాశరాజు ముఖకవళికలు గమనిస్తున్నాడు శంతనుడు.

"మనసులో ఏముందో చెప్తే, మేము వింటాం." శంతనుని గొంతు విని ఉలిక్కిపడ్డాడు దాశరాజు.

"నా కోరిక తమరు మన్నిస్తే-" చేతులు కట్టుకున్నాడు.

"అంగీకరించదగిందైతే అంగీకరిస్తాం అంగీకరించ తగనిదైతే అంగీకరించం, మీ కోరిక ఏమిటో?" శంతనుడు దాశరాజు వంక చూశాడు.

"సత్యవతికి పుట్టే కొడుకే యువరాజు కావాలి."

శంతనుని గుండెకి తిన్నగా బాణంలా గుచ్చుకుంది ఈ కోరిక. ఆ కోరిక తను అంగీకరించలేడు. తన గాంగేయునికి అన్యాయం చేయలేడు. ధర్మాతిక్రమణం తను చేయడు.

"ఇంకేదైనా కోరుకో. ఇది మాత్రం సాధ్యం కాదు." దీర్ఘంగా నిట్టూర్చాడు శంతనుడు.

"ఇదే నా కోరిక, ఇంకేదీ లేదు." నిర్మొహమాటంగా, గట్టిగా అన్నాడు దాశరాజు.

దాశరాజు చేత తిరస్కృతుడైన శంతనుడు నిరాశతో రాజ్యానికి తిరిగి వచ్చాడు.

సత్యవతికి కన్నీళ్ళాగలేదు. తనను ప్రేమించిన వ్యక్తిని వివాహం చేసుకోనివ్వని తండ్రి కోరిక ఆమెను బాధించింది. ఎలాటి ఉత్సాహమూ లేకుండా నది ఒడ్డుకు వెడుతోంది. ఏనాడైనా మహారాజు కనిపించకపోతాడా అనే ఆశతో ఎదురు చూస్తూ యమునా నదీతీరంలోనే ఎక్కువ కాలం గడుపుతోంది.

శంతనుడు సత్యవతీ విరహతప్తుడై, రాజ్య కార్య నిర్వహణాసక్తిని వదిలేశాడు. మందిరం దాటి బయటకు కదలటంలేదు. కృశించిపోతున్న తండ్రిని చూస్తూ ఏం చేయాలో తోచక తికమకపడ్డాడు కొద్ది రోజులు దేవవ్రతుడు.

దేవవ్రతుణ్ణి చూడగానే శంతనుని ముఖం వెలవెలపోయింది. తన ప్రేమ గురించి, తన విరహం గురించి కొడుకుతో ఏం చెప్పుకుంటాడు తను? తప్పనిసరిగా పరిస్థితిని ఎదుర్కోవలసి వచ్చింది.

"నాకు ఒకటే చింత. ఏకపుత్ర దోషం నన్ను బాధిస్తోంది. అందుకే ఇంకా కొడుకులు నాకు కావాలి. వివాహం చేసుకుందామని అనుకుంటున్నా."

తండ్రి మాటలు తడబడుతుంటే, ఆ మాటలు ఏదో నెపంతో అన్నవిగా గ్రహించాడు దేవవ్రతుడు.

తండ్రి మనసు దోచుకున్న సత్యవతి విషయం తెలుసుకున్నాడు. పరివారంతో బయలుదేరాడు దాశరాజు దగ్గరికి.

దాశరాజు పరమానందంతో దేవవ్రతుణ్ణి ఆహ్వానించి అర్ఘ్యపాద్యాదులతో పూజించాడు.

దాశరాజు కోరికను అంగీకరించిన దేవవ్రతునికి, ఇంకా దాశరాజు ముఖంలో ఏదో అసంతృప్తి కనబడింది.

"ఇంకేమైనా కోరిక ఉందా?" దాశరాజుకేసి చూశాడు.

"అయ్యా! తమరు ధర్మప్రభువులు. కానీ తమ కుమారులు..." నసిగాడు దాశరాజు.

అర్థమైంది అతని సందేహ మేమిటో. తను వివాహమే చేసుకోకపోతే? అదే తన నిర్ణయం!

దేవవ్రతుడు దాశరాజు వంక తిరిగి "నేను వివాహమే చేసుకోను. నీ మనుమడే యువరాజు. సరేనా? ఇంకేమైనా కోరిక లున్నాయా?" దాశరాజు భుజం తడుతూ అన్నాడు దేవవ్రతుడు నవ్వి.

దాశరాజు ముఖం సంతోషంతో వెలిగిపోయింది.

"ధర్మప్రభువులు!" దేవవ్రతుని పాదాలకు మొక్కాడు.

ఆ క్షణమే దేవవ్రతుడు భీష్ముడయ్యాడు.

సత్యవతీ - శంతనులు అన్యోన్యానురాగంతో ఆదర్శవంతులై జీవితాన్ని గడిపారు.

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం)
ఆదిపర్వం : చతుర్థాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 3-2-1988)